సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 146 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 16 అక్టోబర్ 2025 | పేజీలు : 4



## దొంతి కాంతమ్మకు ఘన నివాళి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

4



## జర్నలిస్టుల సంక్షేమంపై
# ప్రత్యేక దృష్టి

- త్వరలో నూతన అక్రిడిటేషన్ పాలసీ
- నెలాఖరులోగా విధి విధానాలు పూర్తి చేయాలి
- మంత్రి పొంగులేటి ఆదేశాలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్వో మల్సూర్‌తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడే విధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈ నెల చివరి నాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలని ఆదేశించారు.

## పారిశుద్ధ్యంపై
# పట్టింపేది..?

- అధ్వానంగా రఘునాథపల్లి రోడ్లు
- ఎక్కడ చూసినా చెత్తాచెదారం.. దుర్వాసన






## ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

2

- భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పించాలి
- ఆలయాల భూములను కాపాడాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



## జనంలోకి
# మల్లోజుల

4

- మహారాష్ట్ర సీఎం సమక్షంలో ఆయుధాల అప్పగింత




## ధాన్యం కొనుగోళ్లు
# సజావుగా సాగాలి

3

- కలెక్టర్లతో మంత్రుల వీసీ



## నామినేషన్ వేసిన
# మాగంటి సునీత

4

- జూబ్లీహిల్స్‌లో జోరుగా ప్రచారం..

# ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలి
- ఆలయాల భూములను కాపాడాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** ఆలయాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలోని ప్రధాన ఆలయల అభివృద్ధిపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావుతో కలిసి దేవస్థానల చైర్మన్, ఈఓ, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని దేవస్థానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. జీడికల్ రామచంద్రస్వామి ఆలయం, చిల్పూర్ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయం, ఘనపూర్ తిరుమలనాథ స్వామి ఆలయం, నవాబ్ పేట కోదండ రామస్వామి ఆలయం, చిన్నపెండ్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, జఫర్ గడ్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం మొత్తం ఆరు దేవస్థానాలకు సంబంధించి ఆలయల అభివృద్ధిపైన క్షుణ్ణంగా రివ్యూ నిర్వహించారు. నవంబర్ 10న జరిగే జీడికల్ లక్ష్మీనర్సింహస్వామి కళ్యాణన్ని పురస్కరించుకొని తగు ఏర్పాట్లు చేయాలన్నారు. సీసీ రోడ్ వేయడం, ల్యాండ్ లేవలింగ్, జంగిల్ క్లియరెన్స్, మొక్కలను నాటడం అలాగే ఫెన్సింగ్, సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు తదితర చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. భక్తులు ఉండేందుకు రూంలను నిర్మించాలన్నారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. కోదండ రామస్వామి గుడిలో కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపెండ్యాల లక్ష్మీనర్సింహా స్వామి దేవస్థానానికి సంబంధించి రోడ్, విద్యుత్ సదుపాయాలను కల్పించాలన్నారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతం కావద్దని, దేవస్థానం పేరు మీదున్న అన్ని భూముల సర్వే జరిపించి, రికార్డులు పక్కాగా ఉండలని, హద్దులను పెట్టాలన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, అందుకు తగ్గట్టుగా రెవెన్యూ పరంగా వేగవంతంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేవాలయల భూములను త్వరగా సర్వే చేపిస్తామన్నారు. సమావేశంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓలు గోపీరామ్, వెంకన్న, స్టేషన్ ఘనపూర్, చిల్పూర్, లింగాలఘనపూర్, జఫర్ గడ్, రఘునాథపల్లి తహసీల్దార్లు, జీడికల్, చిల్పూర్ దేవస్థానం కమిటీ చైర్మన్లు, దేవస్థానాల ఈఓలు తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు

**జాఫర్‌గడ్, మన చౌరాస్తా :** జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గో జాతి, గేద జాతి పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. జాఫర్ గడ్ మండలంలోని రఘునాథపల్లి గ్రామపంచాయతీ వద్ద పశు వైద్య అధికారులు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు 23 క్యాంపులు నిర్వహించి 522 రైతులకు సంబంధించిన 5,748 పశువులకు టీకాలు వేసారని జిల్లా పశు వైద్యాధికారి మురళీధరరావు తెలిపారు. నవంబర్ 14 వరకు నెలరోజులపాటు ఈ టీకా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నాలుగు నెలలు నిండిన పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణకు టీకా వేయించాలన్నారు. పశువులకు ఈ వ్యాధి సోకకుండా సంవత్సరంలో రెండుసార్లు అనగా ప్రతి ఆరు నెలల కు ఒకసారి తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. అంతేగాక వేయించినట్లుగా పశువులకు ట్యాగ్ వేయడం జరుగుతుందన్నారు. పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ దేవేందర్, పశు వైద్యులు డాక్టర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.



## కబడ్డీలో మెరిసిన మైనార్టీ విద్యార్థి

### అభినందించిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** ఇటీవల మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో టీఎంఆర్ఐఈఎస్ జూనియర్ కళాశాల బాలుర-1 ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బీ కార్తీక్ బంగారు పతకాన్ని సంపాదించాడు. కాగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా బుధవారం కార్తీక్‌ను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించిఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థి కార్తీక్‌తో పాటు కళాశాల పీడీ రాజును కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూవో డా.బి.విక్రంకుమార్, ప్రిన్సిపాల్ పి.అనిల్ బాబు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- అధ్వనంగా రఘునాథపల్లి రోడ్లు
- ఎక్కడ చూసినా చెత్తాచెదారం.. దుర్వాసన
- పట్టించుకోని అధికారులు



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ..' అన్న చందంగా తరాయారైంది రఘునాథపల్లి పరిస్థితి. పేరుకు మేజర్ గ్రామ పంచాయతీ అయినా పారిశుద్ధ్యంపై పట్టించుకునే వారు కరువయ్యారు. కొన్ని నెలలుగా డ్రైనేజీ క్లీన్ చేయకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై పారుతోంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్మికులు ఉన్నప్పటికీ ఈ మోరిని పట్టించుకున్న దాఖలాలు లేవు, కేవలం ప్రధాన వీధులపైన మాత్రమే దృష్టి మళ్లించిన పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ అధికారులు గ్రామంలోని పలు వాడల్లో దృష్టి సారించకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. పంచాయతీలోని నాలుగో వార్డులో గత కొంతకాలంగా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగినట్లయితే ప్రజలు దవాఖానా బాట పట్టాల్సిందే. దీనికి తోడు ఇటీవల ఓ కాంట్రాక్టర్ నిర్మించిన డ్రైనేజీ కూలిపోవడంతో కూడా మరి కొంత ఇబ్బంది కలుగుతుంది. ప్రభుత్వం పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి రోగాలు ప్రబలకుండా చూడాలని అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఆ దిశగా కృషి చేయకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు తక్షణమే దృష్టి సారించి డ్రైనేజీలను క్లీన్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



## ఘనంగా పోషణ మహోత్సవం

**నర్మెట, మన చౌరాస్తా :** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సునితాదేవి అన్నారు. నర్మెట మండలంలోని వెల్దండలో పీహెచ్సీలో పోషణమాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునితాదేవి మాట్లాడుతూ తల్లులు, గర్భిణులు, చిన్నారులు అందుబాటులో ఉన్న ఆహారపదార్థాలు పాలు, గుడ్లు, ఆకుకూరలు, చేపలు, బెల్లం, పప్పులు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు శ్రీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అమృత, అంగన్వాడీ టీచర్లు కుంటి రాంబాయి, మమత, మంజుల, విజయకుమారి, లీల, నాగమ్మ, ఉమ, నాగమణి పాల్గొన్నారు.

## రవీందర్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నరేందర్



**బచ్చనపేట, మనచౌరాస్తా :** పదవి వ్యామోహంతో పూటకో పార్టీ మారే మాసాపేట రవీందర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించే స్థాయి కాదని, ఆయన ఎమ్మెల్యేకు వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంధమల్ల నరేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసే గొప్ప వ్యక్తి అని, నిబద్ధత కలిగిన మహా నాయకుడని కొనియాడారు. జనగామ ప్రజల కోసం తన సొంత హాస్పిటల్‌లో ఉచితంగా వైద్యం అందిస్తున్న నాయకున్ని పట్టుకొని ఎందుకు పనికిరాని రవీందర్ రెడ్డి అనే వ్యక్తి విమర్శించడం విడ్డురంగా ఉందన్నారు. ఎమ్మెల్యే పై విమర్శలు చేయడం మానుకుని, తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

- కలెక్టర్లలో రాష్ట్ర మంత్రుల వీసీ
- రైతులకు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆదేశాలు



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎస్ రామకృష్ణా రావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టరెట్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ బెన్షలోమ్, ఆర్డీఓ లు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులు హాజరయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్యాడి వినియోగం తెలంగాణలో ఎక్కువగా ఉందని, ఖరీఫ్ ప్రొక్యూర్మెంట్ ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఇందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, రవాణా సమస్యలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో గన్నీ, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే మిషన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు తదితరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైతే పైఅధికారులను, సంబంధిత మంత్రులను సంప్రదించాలని సూచించారు. గత రెండు పంటల కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే తరహాలో ఇప్పుడు కూడా కొనుగోలు జరిగేలా చూడాలని కోరారు. మిల్లర్లు సమస్యలు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఎంఎస్పీ, బోనస్ అందించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ట్యాబ్ ఎంట్రీ జరిగేలా చూడాలని ఆదేశించారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, ఇప్పటి వరకు పద్ధతి ప్రకారం, ఎలాటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, అదే విధంగా ఇప్పుడు కూడా సక్రమంగా ఏ రోజుకారోజు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆర్డీవోలు, సివిల్ సప్లై, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించి జిల్లాలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ప్రతీ కేంద్రం లో కనీస మౌలిక వసతులతో పాటు సరిపడా గన్ని బ్యాగ్ లు, టార్పాలీన్, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఆర్డీవో లు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసేలా చూడాలన్నారు.



## పీఆర్సీని ప్రకటించాలి

**టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భీమదేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి, ముల్కనూర్, ముత్తారం, కొత్తకొండ, గట్లనరసింగపూర్, మల్లారం, ముస్తఫా పూర్ తదితర పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన టి పి టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నే బోయిన తిరుపతి సమావేశాల్లో మాట్లాడుతూ ప్రభుత్వం పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత పిఆర్సి కాలం రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ ప్రభుత్వం నేటికీ పి ఆర్ సి పైన నిర్ణయం చేయకపోవడం సరైన ది కాదు అన్నారు. పెండింగులో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వము ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతినెల 700 కోట్లను విడుదల చేసి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ఎన్జీవోల పేరు మీద ఉపాధ్యాయులకు ఇస్తున్న వివిధ రకాల శిక్షణలను నిలిపివేయాలని,పాఠశాల నుండి టీచర్లను దూరం చేయడం సరైనది కాదని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలంలో ప్రభుత్వము ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, ఉద్యోగులను క్రమబద్ధీకరించి టైం స్కేలు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవోలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ తాత్కాలిక బదిలీకి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు చందుపట్ల రాజేందర్ , చంద్రగిరి లక్ష్మయ్య,మండల శాఖ ప్రధాన బాధ్యులు కాలేసి కొమరయ్య, ప్రతాప్ అనిల్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి

- మండల వ్యవసాయశాఖ అధికారి పద్మ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** వ్యవసాయ యాంత్రికరణ పథకం కింద 2025 26 సంవత్సరానికి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి పలు వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పద్మ తెలిపారు. రోటవేటర్లు 7, చేతి పంపులు 143, తైవాన్ పంపులు 29, కల్టివేటర్లు 10, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ 1, పవర్ విడరు 1, బ్రష్ కట్టర్లు 2, పవర్ టిల్లర్ 1, గడ్డి కట్టలు చుట్టే యంత్రాలు 2 కేటాయించబడ్డాయన్నారు. ఈ యంత్రాల ద్వారా రైతులు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆసక్తి గల రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.



## బీసీ జేఏసీ కన్వీనర్గా సేవెల్లి సంపత్ ఎన్నిక

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్పై హైకోర్టు విధించిన స్టేను తీవ్రంగా ఖండిస్తూ, వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఏకగ్రీవంగా పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా జయ మల్లేశం కురుమ, పండుగ హరీష్ ముదిరాజ్ వ్యవహరించారు. సమావేశంలో బీసీ జేఏసీ కన్వీనర్గా సేవెల్లి సంపత్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ అక్టోబర్ 18న జరగబోయే బీసీ బంద్కు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీల హక్కులను కాపాడుకునే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రముఖ బీసీ జేఏసీ నాయకులు దూడల సిద్దయ్య గౌడ్, డాక్టర్ మాచర్ల భిక్షపతి ముదిరాజ్, సాదిక్ అలీ, మంగంపల్లి రాజు, ప్రశాంత్ యాదవ్, అలాగే బీసీ సంక్షేమ సంఘం జేఏసీ నాయకుడు పండుగ హరీష్ ముదిరాజ్ పాల్గొన్నారు. వీరితో పాటు కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ అధ్యక్షుడు చిక్కుడు బాలయ్య ముదిరాజ్, రామేశ్వర్ చారి, చౌదర్పల్లి చంద్రశేఖర్, ధర్మపురి శ్రీనివాస్, పిట్టల రజనీకాంత్, బోళ్ల రాజ్ కుమార్, నీల సాంబరాజు, మారబోయిన శ్రీనివాస్, ఎన్. మహేందర్, సత్యం శ్రీనివాస్, శైలేంద్ర శ్రీనివాస్, కే. రాజు, చంద్రమౌళి, ఎం.సత్తయ్య, శ్రీనివాస్ నరసింహులు, సమ్మయ్య యాదవ్, కే. అవినాష్, మదన్, చింతకింది మల్లేష్, బోళ్ల సంపత్ యాదవ్, పూర్ణచందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పశువ్యాధుల నివారణ కరపత్రాల ఆవిష్కరణ

**హనుమకొండ, మన చౌరాస్తా :** జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వడ్డేపల్లిలోని పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నెలరోజుల పాటు జరిగే టీకాల కార్యక్రమాల కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. కావ్య మాట్లాడుతూ.. పశు సంపద అనేది ఎంతో విలువతో కూడుకున్నదని అన్నారు. గతంలో పశుసంపద పశువులు, గొర్రెలు, మేకలు, ఆవులను ఒక ఆస్తిగా చెప్పుకునే వాళ్లని ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకృష్ణ, వైద్యులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సీపీఆర్పై విద్యార్థులకు అవగాహన సదస్సు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని డాక్టర్ పి.వి. రంగారావు గురుకులంలో బుధవారం గుండె ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే పద్ధతులపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రుబీనా, డాక్టర్ రహ్మాన్ విద్యార్థులకు గుండె పునరుద్ధరణ చర్యలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. శ్వాస ఆగిన వ్యక్తికి తక్షణం చేయాల్సిన చర్యలను ప్రదర్శిస్తూ, సమయస్ఫూర్తితో స్పందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆఫ్రిన్ మేడం నాయకత్వంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పర్యవేక్షకుడు మోహన్, ఆషా, ఆరోగ్య కార్యకర్తలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి
# సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

**హనుమకొండ, మన చౌరాస్తా :** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి కాంతమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో హన్మకొండలోని పీజీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మాతృ యజ్ఞం కార్యక్రమంలో సీఎం రేవంత్రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే దొంతిని పరామర్శించారు. అంతకుముందు హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో గల హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి నగర మేయర్ గుండు సుధారాణి శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చాన్ని అందజేసి స్వాగతించారు. ఈ సందర్భం గా హెలిప్యాడ్ వద్ద బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ముఖ్యమంత్రికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంపీలు డా.కడియం కావ్య, బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామా చంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



### సీఎంను కలిసిన వరంగల్ సీపీ

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ పర్యటనలో భాగంగా బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం హెలికాప్టర్లో చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు.






## నామినేషన్ వేసిన మాగంటి సునీత

**హైదరాబాద్, మన చౌరాస్తా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత గోపీనాథ్ తొలి సెట్ నామినేషన్ వేశారు. షేక్పేటలోని తహశీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు పద్మారావు, రావుల శ్రీధర్రెడ్డి, దీదీప్య రావు, విష్ణువర్ధన్రెడ్డి, రాజ్కుమార్ పటేల్, సమీనా యాస్మిన్‌తో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ నెల 21 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. నవంబర్ 11న ఉప ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. అదే నెల 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

# జనంలోకి మల్లోజుల

- మహారాష్ట్ర సీఎం సమక్షంలో ఆయుధాల అప్పగింత
- వేణుగోపాల్రావుకు రూ.6 కోట్ల రివార్డు అందజేత



**హైదరాబాద్, మన చౌరాస్తా :** సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలో ఈ మేరకు మల్లోజులను పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయుధాలు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో తమ ఆయుధాలను మల్లోజుల అందించారు. దాదాపు రూ.6 కోట్ల రివార్డు మల్లోజులపై ఉండటంతో రివార్డును ఆయనకు సీఎం ఫడ్నవీస్ అప్పగించారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో మోస్ట్ వాంటెడ్‌గా మల్లోజులు ఉన్నారు. నిన్న 60 మంది మావోయిస్టులతో కలిసి మల్లోజుల లొంగిపోయిన విషయం తెలిసిందే.



## బర్త్ డే రోజున నోట్ బుక్స్ పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవి జూనియర్ కళాశాలలో విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థి బండ శ్రీరామ్ తన పుట్టిన రోజు సందర్భంగా సహచర కరాటే విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్, ఇన్స్ట్రక్టర్ అక్షిత్ మణివర్ధన్, విద్యార్థుల తల్లిదండ్రులు బండ బిక్షపతి, ప్రభాకర్,శ్రీధర్, యుగేంధర్, నవీన్, కరాటే విద్యార్థులు నిక్షిత్, జెస్సిక,సామ్యేల్ జాన్,అవంతిక పాల్గొన్నారు



## బంద్‌ను విజయవంతం చేయండి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ సాధించాలనే లక్ష్యంతో ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ ఐక్య వేదిక పిలుపునిచ్చింది. బుధవారం హుస్నాబాద్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన్‌లో బీసీ ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమాలకు సంఘీభావం తెలిపి, బంద్ విజయవంతం చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ బీసీ ఐక్య వేదిక కమిటీని ఏర్పాటు చేసి, మేకల వీరన్న యాదవ్‌ను కోఆర్డినేటర్‌గా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, పెరియార్ వంటి సామాజిక విప్లవకారుల ఆలోచనలను అనుసరించి బీసీ కులాలు ఏకతాటిపైకి రావాలని, బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, జేఏసీలు, బీసీ కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యాపారులు, హోటళ్లు, షాపులు బంద్‌కు సహకరించాలని వేదిక కోరింది.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన




**కొమురవెల్లి, మన చౌరాస్తా :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ శ్రీను సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా బుధవారం మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థినులు ఆపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు తెలిసి తెలియని వయసులో ప్రేమ పెళ్లి అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పెద్దలను గురువులను గౌరవించాలని సూచించారు. క్లాస్ రూమ్ లలో అందరితో కలిసి ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత క్లాస్ టీచర్కు లేదా హెడ్మాస్టర్ కు తెలిజేయాలన్నారు. కార్యక్రమంలో కాలేజ్ స్పెషల్ ఆఫీసర్ నీరజ, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం ఏఎస్ఐ సదయ్య, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

## పుట్టిన రోజు సందర్భంగా అన్నప్రసాద వితరణ



**జనగామ, మన చౌరాస్తా :** పట్టణానికి చెందిన వేల్పుకుండ లాస్య, ధీరన్ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు వేల్పుకొండ మంజుల, మహేందర్ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామ రైల్వే స్టేషన్ వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు వారి పుట్టిన రోజు, పెళ్లిరోజు వేడుక సందర్భంగా నిరాశ్రయులు, అనాథలకు ఒక పూట ఆకలిని తీర్చాలని తీర్చే విధంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. నేడు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన లాస్య, ధీరన్‌లకు జన్మదిన శుభాకాంక్షలు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అంజి, కొయ్యడ రవి, పందుగ నరేష్, బింగి నరసింహులు, బొట్ల సాయి, జనగామ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంధ కుమారస్వామి, వేల్పుకొండ నర్సింహులు, బొల్లపల్లి కుమారస్వామి, సత్తయ్య, యాదగిరి, మురళి, వెంకటస్వామి, సుమన్, రవి, శేఖర్ విజయ్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.